క్లుప్తంగా

శాకంబరి అలంకరణలో ముత్యాలమ్మ



ముత్యాలమ్మవారిని శాకంబరిగా అలంకరించిన దీపారాధన సంఘ సభ్యులు

సామర్లకోట: స్థానిక కాకినాడ రోడ్డులో వేంచేసి యున్న ముత్యాలమ్మవారు ఆదివారం శాకంబరిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆషాఢ మాసం కావడంతో ముత్యాలమ్మవారిని పంచారామ క్షేత్రమైన శ్రీబాలత్రిపుర సుందరి సమేత కుమార రామభీమేశ్వరస్వామి దేవస్థానం దీపారాధన సంఘ సభ్యులు కూరగాయలు, పండ్లతో అలంకరించి పూజలు చేశారు. సామర్లకోట- కాకినాడ రోడ్డులో ఉన్న అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. కాకినాడ రోడ్డులో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఆషాఢ మాసం రెండవ ఆదివారం కావడంతో పెద్దాపురం మరిడమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు ఈ రోడ్డులో రాకపోకలు సాగించే భక్తులు ముత్యాలమ్మ వారిని దర్శించుకున్నారు.

సార్వత్రిక సమ్మెలో భాగస్వాములు కండి

పెద్దాపురం: కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా ఈ నెల 9న చేపట్టిన సార్వత్రిక సమ్మెలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) పిలుపునిచ్చింది. స్థానిక వరహాలయ్యపేట యాసలపు సూర్యారావు భవనంలో ఆదివారం యూనియన్ ప్రాజెక్టు సమావేశం దాడి బేబీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు బేబీ.ఎస్తేరు రాణి మాట్లాడుతూ కార్మిక చట్టాలను రద్దు చేసి కోడ్‌లుగా మార్పు చెయ్యాలని బీజేపీ ప్రయత్నిస్తోందన్నారు. జూలై 9న నిర్వహించనున్న సమ్మెలో కార్మిక వర్గం పాల్గొని విజయవంతం చెయ్యాలని ఆయన కోరారు.

విద్యుత్తు సరఫరాకు నేడు అంతరాయం

సామర్లకోట: స్థానిక విద్యుత్తు సబ్ స్టేషన్‌లో మరమ్మతులను పురస్కరించుకొని సోమవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు ఎవీఎస్‌డీఎస్ ప్రభాకర్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా కొత్తపేట, చిన్నవీధి, కోటపేట, ఉప్పువారి వీధి, పాత తహసీల్దార్ కార్యాలయం ఏరియా, బలుసుల పేట, సంగీతరావు పేట, వీర్రాఘవపురం, మఠం సెంటర్, కొత్తూరు, నిమ్మతోట, సంపెంగ తోట, తాండ్ర పాపారాయుడు విగ్రహం ఏరియా, గణపతి నగరం తదితర ప్రాంతాలకు విద్యుత్తు సరఫరాలో అసౌకర్యం కలుగుతుందన్నారు. విద్యుత్తు వినియోగదారులు గమనించాలని సూచించారు.


రైల్వే గేటు పరిశీలన



సామర్లకోట రైల్వే గేటును పరిశీలిస్తున్న మేనేజర్ రమేష్

సామర్లకోట: స్థానిక కాకినాడ రోడ్డులోని రైల్వే గేటును స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్ ఆదివారం సాయంత్రం పరిశీలించారు. అనేక మంది వాహన చోదకులు గేటు మీదుగా రాకపోకలు సాగిస్తున్న సమయంలో కొంత మంది గేటులో ఉండగా గేటు వేస్తున్నారనే ఫిర్యాదుల మేరకు ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గేటులోనికి వాహన చోదకులు ప్రవేశించిన తరువాత వారు బయటకు వెళ్లే విధంగా చూడాలని గేట్ మెన్‌లకు ఆయన సూచించారు. గేటు వేసే ముందు సైరన్ మోగించాలని సూచించారు. గేటు కిందికి దిగుతున్న సమయంలో వాహన చోదకులు గేటులోనికి ప్రవేశించరాదని ఆయన సూచించారు.

వాహన చోదకులు హెల్మెట్ ధరించాలి



హెల్మెట్ ఆవశ్యకతపై ఉప్పాడ బీచ్ రోడ్డులో అవగాహన కల్పిస్తున్న పోలీసులు

కొత్తపల్లి: ఉప్పాడ-కాకినాడ బీచ్ రోడ్డులో పిఠాపురం సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆదివారం హెల్మెట్ ధరించడంపై వాహనచోదకులకు అవగాహన కల్పించారు. సిబ్బందితో బైక్‌పై ర్యాలీ నిర్వహించారు. ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఆయన సూచించారు.

జీవాల ఎరువు.. పంటలకు మేలు

- పొలాల్లో గొర్రెలు, మేకల మంద విసర్జితాలతో భూసారం వృద్ధి
- జీవాల మందతో పంటలకు సహజ ఎరువు
- మందను కట్టేందుకు రైతుల ఆసక్తి



ఆర్‌బీపట్నంలో పొలాల్లో గొర్రెల మంద

పెద్దాపురం: ఓపక్క పంటలకు వేసే ఎరువుల ధరలు ఏటేటా పెరిగిపోతున్నాయి. ఆరుగాలం కష్టించి పనిచేసిన రైతన్నకు సాగుకు పెరిగిన ఖర్చులు తడిసి మోపుడవుతున్నాయి. దీంతో రైతులు సేంద్రియ, సహజ ఎరువులు వినియోగించేందుకు మొగ్గు చూపుతున్నారు. ముఖ్యంగా గొర్రెల మందను పొలాల్లో కట్టడం ద్వారా వాటి విసర్జితాలు నేలలో కలిసేలా చర్యలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం గ్రామీణ ప్రాంత పొలాల్లో ఎక్కడ చూసినా జీవాల విసర్జితాల కోసం ఆవులు, గొర్రెలు, మేకల మందను కడుతున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. తక్కువ ఖర్చుతో లభించే జీవాల నుంచి లభించే సహజ ఎరువు భూసారం పెరిగేందుకు, పంటలు బాగా పండేందుకు ఉపయోగపడుతున్నాయని భావించి రైతులు గొర్రెల కాపరులతో మాట్లాడి, మందను పొలాలకు తరలిస్తున్నారు.

సేంద్రియ ఎరువులు పంటలకు మేలు

అధునాతన పద్ధతులతో కొత్త పుంతలు తొక్కుతున్న వ్యవసాయ రంగంలో ఇంకా పాత విధానాలను కొనసాగించేందుకు రైతులు మక్కువ చూపుతున్నారు. వ్యవసాయంలో ఖర్చులు తగ్గించుకునేందుకు పాత విధానాలు ఉపయోగపడుతున్నాయని రైతులు అభిప్రాయపడుతున్నారు. సేంద్రియ, సహజ ఎరువులు పంటలకు మేలని వ్యవసాయ శాఖ సిబ్బంది రైతులను ప్రోత్సహిస్తున్నారు. పెద్దాపురం నియోజకవర్గంలోని కొండపల్లి, ఆనూరు. ఆర్‌బీపట్నం, ఆర్‌బీకొత్తూరు, చినబ్రహ్మదేవం, వాలుతిమ్మాపురం, సామర్లకోట మండలంలోని మేడపాడు, పెదబ్రహ్మదేవం, వేట్లపాలెంలో గొర్రెల పెంపకందారులున్నారు. వేలాది ఎకరాల్లో రైతుల కోరిక మేరకు వారు మందను కడుతున్నారు. ఇలా గొర్రెల మందను పొలాల్లో ఉంచినందుకు వారికి ఒప్పందం ప్రకారం సొమ్ము లేదా ఫలసాయం రైతులు ఇస్తారు.

సాధారణంగా అపరాల పంట తర్వాత

ఏటా అపరాల పంటలు పండిన తర్వాత గొర్రెల మందలను పొలాల్లో ఉంచుతారు. అవి అప్పటికే పొలాల్లో మిగిలిన అపరాల మొక్కలను బాగా తిని, ఆ తర్వాత వాటి విసర్జితాలతో నేల సారవంతంగా మారి ఆ తర్వాత పండించే పంటలు అధిక దిగుబడులు ఇస్తాయి. ఈ విధానం గొర్రెలు, మేకల పెంపకందారులకు, రైతులకు ఉపయోగకరంగా ఉంటోంది.

ఆదరణ పెరిగింది



రైతులు ఇచ్చే డబ్బులు గిట్టుబాటు కాకపోయినా పొలాల్లో మంద కడుతున్నాం. దూర ప్రాంతాలకు రోజుల తరబడి నడుచుకుంటూ మందలను తోడ్కొని వెళ్తున్నాం. అక్కడే వంట చేసుకుని రాత్రిళ్లు నివాసం ఉంటున్నాం. జీవాలకు, మాకూ పోషణ దొరుకుతోందని కష్టమైనా చేస్తున్నాం. ప్రస్తుతం మందకు ఆదరణ పెరిగింది.

– ప్రకృతి వెంకటరమణ, గొర్రెల పెంపకందారుడు, ఆర్‌బీ పట్నం

ఎరువుల ఖర్చు తగ్గుతుంది



పొలాల్లో గొర్రెలు, మేకల మందలు వేసుకోవడం ద్వారా పంట పొలాలకు ఎంతో మేలు. ఎరువుల ఖర్చు తగ్గడంతో పాటు భూసారం పెరుగుతుంది. పంట దిగుబడి పెరుగుతుంది. గొర్రెల పెంపకందారులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలి.

– పల్లా శ్రీనివాస్ యాదవ్, రైతు, ఆర్‌బీ కొత్తూరు

విద్యతోనే ఉన్నత స్థానం



పిఠాపురం జగ్గయ్య చెరువు కాలనీలో ఏకలవ్యుడి జయంత్యుత్సవంలో పాల్గొన్న నాయకులు

పిఠాపురం: స్థానిక జగ్గయ్య చెరువులో ఎరుకుల ఆత్మగౌరవ సేవా సంఘం ఆధ్వర్యంలో ఏకలవ్యుడి జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. వార్డు కౌన్సిలర్, ఎరుకుల ఆత్మగౌరవ సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కావాడ పోశయ్య ఆధ్వర్యంలో ఏకలవ్యుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విద్యతోనే ఉన్నత స్థానం లభిస్తుందని అన్నారు. గురువు లేకున్నా స్వయంశక్తితో ఏకలవ్యుడు గొప్ప విలుకాడు అయ్యాడని చెప్పారు. ప్రతి యువకుడు ఆయనను స్ఫూర్తిగా తీసుకుని ఉన్నత చదువులు అభ్యసించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు దాసరి వీరలంక సజ్జా రాజేంద్ర, జగ్గంపేట సంఘం మండలాధ్యక్షుడు మానుపాటి ఈశ్వరరావు, ఏలేశ్వరం అధ్యక్షుడు బండి నూకరాజు, అర్బన్ క్రెడిట్ సొసైటీ మాజీ అధ్యక్షుడు బాలిపల్లి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవకు లయన్స్ ఒక వేదిక



కుక్కలకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేస్తున్న పశుసంవర్ధక శాఖ ఏడీ ప్రమీల



లయన్స్ క్లబ్ నూతన కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం, చిత్రంలో డాక్టర్ బాదం బాలకృష్ణ

- లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ ఈశ్వరకుమార్

సామర్లకోట: సేవ చేయాలనే ఆలోచన ఉన్న వారికి లయన్స్ క్లబ్ ఒక మంచి వేదిక అని జిల్లా గవర్నర్ ఈదల ఈశ్వరకుమార్ అన్నారు. స్థానిక మండల పశువైద్య కేంద్రంలో జునోసిస్ డే సందర్భంగా లయన్స్ క్లబ్, ఏరియా పశువైద్య కేంద్రం సంయుక్తంగా ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 20 ఏళ్లుగా సామర్లకోట లయన్స్ క్లబ్ ఏటా జునోసిస్‌డేను పురస్కరించుకొని పెంపుడు కుక్కలకు, పశువులకు ఉచితంగా యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేయడం అభినందనీయమన్నారు. ఈ వ్యాక్సిన్ వేయడానికి కృషి చేస్తున్న లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు సింగవరపు సత్యనారాయణను ప్రత్యేకంగా అభినందించారు. పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టరు పీవీవీవీ వరప్రసాద్ మాట్లాడుతూ పెంపుడు కుక్కలకు ఏటా తప్పని సరిగా యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేయించాలన్నారు. పిచ్చి కుక్క కాటుకు మందు లేదనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గమనించాలన్నారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వారం రోజుల పాటు స్థానిక పశువైద్య కేంద్రంలో ఉచితంగా కుక్కలకు రేబిస్ వ్యాక్సిన్ వేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టరు అమలకంటి శ్రీనివాసరావు అధ్యక్షత వహించగా కార్యదర్శి బడుగు బాబి, కోశాధికారి యేలేటి రమేష్ జోనల్ చైర్మన్ కానుబోయిన విజయకృష్ణ, సామర్లకోట క్లబ్ మాజీ అధ్యక్షుడు కె.ఆదినారాయణరెడ్డి, మేకా శ్రీనివాసరావు, గుండు శంకరరావు, ఎస్ సత్యనారాయణ, పశుసంవర్ధక శాఖ ఏడీ ఈ ప్రమీల, పశుసంవర్ధశాఖ డాక్టర్లు, లయన్స్ క్లబ్ సభ్యులు, రైతు సంఘం అధ్యక్షుడు కంటే బాబు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ అడబాల కుమారస్వామి, మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ యార్లగడ్డ చిన్ని, కౌన్సిలర్ బలుసు వాసు, జనసేన పట్టణ అధ్యక్షుడు సరోజ్ వాసు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో షెడ్డు నిర్మాణం

స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో లయన్స్ క్లబ్ సీనియర్ సభ్యుడు సత్యవోలు వీరవెంక సూర్యనారాయణమూర్తి సహకారంతో నిర్మించిన రోగులకు విశ్రాంతి షెడ్డును ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ప్రారంభించారు. అనంతరం లయన్స్ క్లబ్ ఏబీ భవనాన్ని జిల్లా గవర్నర్ ఈదల ఈశ్వరకుమార్ ప్రారంభించారు. సామర్లకోట భీమేశ్వరా లయన్స్ క్లబ్ ఏర్పడి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా సిల్వర్ జూబ్లీ వేడుకలు నిర్వహించారు. ఇప్పటి వరకు పని చేసిన మాజీ క్లబ్ చైర్మన్లను, క్లబ్‌కు ఉత్తమ సేవలందించిన వారిని సత్కరించారు.

సామర్లకోట: లయన్స్ క్లబ్ ద్వారా ప్రజలకు సేవలు విస్తృతం చేయాలని లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ డాక్టర్ బాదం బాలకృష్ణ అన్నారు. సామర్లకోట -శ్రీభీమేశ్వరా లయన్స్ క్లబ్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం సందర్భంగా ఆదివారం రాత్రి లయన్స్ క్లబ్ భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామర్లకోట క్లబ్ ఏర్పడి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా సిల్వర్ జూబ్లీ వేడుకల సమయంలో నూతన కమిటీ ప్రమాణ స్వీకారం చేయడం అభినందనీయమన్నారు. క్లబ్‌కు చెందిన ఈదల ఈశ్వరకుమార్ గవర్నర్‌గా ఎంపిక కావడానికి ఆయన చేసిన సేవలే కారణమన్నారు.సామర్లకోట క్లబ్ ఉత్తమ సేవలందించి గుర్తింపు పొందిందన్నారు. గవర్నర్ ఈశ్వరకుమార్ మాట్లాడుతూ లయన్స్ క్లబ్‌లో చేరడానికి ఉత్సాహంగా ఉన్న వారికి ఎప్పుడూ స్వాగతం ఉంటుందన్నారు.

నూతన అధ్యక్షుడిగా డాక్టర్ అమలకంటి

స్థానిక లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా డాక్టర్ అమలకంటి శ్రీనివాసరావు, కార్యదర్శిగా బడుగు సీతారామరాజు, కోశాధికారిగా యేలేటి రమేష్‌తో పాటు కమిటీ సభ్యులతో డాక్టరు బాదం బాలకృష్ణ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి క్లబ్ మాజీ అధ్యక్షుడు ఎస్ఆర్‌వైవీఆర్ ప్రసాద్ అధ్యక్షత వహించగా, జిల్లా అధ్యక్షుడు చిత్తూలూరి వీర్రాజు, మొదటి వైస్ గవర్నర్ చిట్టినీడి శ్రీనివాసు, రెండవ వైస్ గవర్నర్ పెదిరెడ్డి ఉమామహేశ్వరరావు, రీజన్ చైర్మన్ విజయకృష్ణ కోశాధికారి బడుగు బాబీ, మాజీ అధ్యక్షులు మాజేటి కృష్ణ, బోనగిరి సాంబమూర్తి, సింగవరపు సత్యనారాయణ, కర్రి ఆదినారాయణరెడ్డి, ఎం విజయ భాస్కరరెడ్డి, మేకా శ్రీనివాసరావు, సేపెని సురేష్ పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడతాం

- గొల్లప్రోలులో నేడు వైఎస్సార్ సీపీ సర్వసభ్య సమావేశం
- ఏర్పాట్లను పర్యవేక్షించిన నియోజకవర్గ ఇన్‌చార్జ్ వంగా గీత



ఏర్పాట్లపై నాయకులతో సమీక్షిస్తున్న వంగా గీతావిశ్వనాథ్

పిఠాపురం: ఈనెల 7వ తేదీ సోమవారం పిఠాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ విస్తత స్థాయి సమావేశం గొల్లప్రోలు సత్యకృష్ణ కల్యాణ మండపంలో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ వంగా గీతావిశ్వనాథ్ తెలిపారు. గొల్లప్రోలులో ఆమె ఆదివారం ఏర్పాట్లు పర్యవేక్షించారు. భారీ సంఖ్యలో వైఎస్సార్ సీపీ నేతలు కార్యకర్తలు హాజరుకానున్న నేపథ్యంలో అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పిఠాపురం నియోజకవర్గం వైఎస్సార్ సీపీ సర్వసభ్య సమావేశం సోమవారం ఉదయం 9.30 గంటలకు నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పార్టీ రీజనల్ కోఆర్డినేటర్, శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. ఆయనతో పాటు కాకినాడ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా, పార్లమెంట్, అసెంబ్లీ కోఆర్డినేటర్లు, ఎమ్మెల్సీలు, పార్టీ ముఖ్య నేతలు పాల్గొంటారన్నారు. ఈ సమావేశానికి నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ నాయకులు కార్యకర్తలు అభిమానులు ప్రజలు భారీగా తరలి వచ్చేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆమె తెలిపారు. ఇప్పటికే పిఠాపురం మున్సిపాలిటీ, గొల్లప్రోలు నగర పంచాయతీతో పాటు గొల్లప్రోలు, పిఠాపురం, కొత్తపల్లి మండలాల నాయకులతో ఏర్పాట్లపై సమీక్షించామన్నారు.

కూటమి ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత

ఎన్నికల్లో సూపర్ సిక్స్ పేరుతో పథకాలు అమలు చేస్తామని నమ్మించి మోసం చేయడంతో ప్రజలందరూ కూటమి ప్రభుత్వంపై తిరుగుబాటుకు సిద్ధంగా ఉన్నారన్నారు. వారికి అండగా వైఎస్సార్ సీపీ పోరాటం చేస్తుందన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు ఈపోరాటం ఆగదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలను ఏవిధంగా మోసం చేసారో తెలియజేస్తామన్నారు. పథకాల్లో కోతలు విధిస్తూ పేద ప్రజలను కూటమి ప్రభుత్వం నట్టేట ముంచుతోందన్నారు. రెడ్ బుక్ రాజ్యాంగం పేరుతో వైఎస్సార్ సీపీ నేతలపై తప్పుడు కేసులు పెట్టి వేధిస్తోందన్నారు. వీటన్నిటి పైనా పోరాటం చేసి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడతామన్నారు. ఈమె వెంట పలువురు వైఎస్సార్ సీపీ నేతలు ఉన్నారు.

పశుమాంసం స్వాధీనం

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చెందుర్తిలో ఆదివారం అక్రమ పశువధశాలపై దాడి చేసి నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి 1000 కిలోల పశుమాంసం స్వాధీనం చేసుకున్నట్లు గొల్లప్రోలు పోలీసులు తెలిపారు. అక్రమంగా పశువధ జరుగుతోందని అందిన సమాచారం మేరకు చెందుర్తి గ్రామ శివారు ప్రాంతంలో అక్రమ పశువధశాలపై దాడి చేశామన్నారు. పశువులను వధించి వాటి మాంసం విక్రయించడానికి ప్రయత్నిస్తున్న ఆరుగుల తాతయ్య, గుడివాడ గున్నయ్య, వాసా జగదీష్ , మిర్యాల రమేష్‌ను అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు. వారి వద్ద నుంచి సుమారు 1000 కిలోల పశుమాంసంతో పాటు ఆటో, నాలుగు మోటార్ సైకిళ్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. స్వాధీనం చేసుకున్న పశు మాంసాన్ని పూడ్చిపెట్టి, నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గొల్లప్రోలు ఎస్సై ఎన్ రామకృష్ణ తెలిపారు.

తాటాకిల్లు దగ్ధం

కొత్తపల్లి: కొమరగిరి శివారు ఆనంద్‌నగర్‌లో అగ్నిప్రమాదంతో శనివారం రాత్రి తాటాకిల్లు దగ్ధమైంది. పిట్టా ముని కుటుంబం తాటాకు పాకలో నివాసం ఉంటున్నారు. శనివారం వారు బయటకు వెళ్లిన సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. గృహోపకరణాలు పూర్తిగా అగ్నికి అహుతయ్యాయి. సుమారు రూ.3లక్షల వరకూ ఆస్తినష్టం సంభవించినట్లు బాధితులు తెలిపారు.

పాదగయ క్షేత్రంలో నందీశ్వరునికి ప్రత్యేక పూజలు

పిఠాపురం: పాదగయ క్షేత్రంలోని ఏకశిల, సాలగ్రామ నందీశ్వరునికి ఆదివారం రాత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏటా తొలి ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో ఆదివారం ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో నందీశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

హత్యాయత్నం కేసులో నిందితుల అరెస్టు

పిఠాపురం: గొల్లప్రోలు బైపాస్ రోడ్డులోని డాబా హోటల్ వద్ద జరిగిన హత్యాయత్నం కేసులో ముద్దాయిలను ఆదివారం అరెస్టు చేసినట్లు గొల్లప్రోలు పోలీసులు తెలిపారు. ఈ కేసులో నిందితులైన గొల్లప్రోలుకు చెందిన జ్యోతుల రాంబాబు అలియాస్ రాము, ఊట దుర్గకుమార్ అలియాస్ ఇంద్రను ఆదివారం గొల్లప్రోలు టోల్ ప్లాజా వద్ద అరెస్టు చేసినట్లు తెలిపారు. నిందితులను కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు. గొల్లప్రోలు ఎస్సై ఎన్ రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎనిమిది మంది జూదరుల అరెస్టు

పిఠాపురం: గొల్లప్రోలు శివారులో నిర్వహించిన పేకాట శిబిరంపై దాడి చేసి 8 మంది జూదరులను ఆదివారం అరెస్ట్ చేసినట్లు గొల్లప్రోలు పోలీసులు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.22,590 నగదు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గొల్లప్రోలు ఎస్సై ఎన్.రామకృష్ణ తెలిపారు.

నేత్ర పర్వంగా పాండురంగ స్వామి కల్యాణం



పట్టు వస్త్రాల అలంకరణలో పంచారామ క్షేత్రంలోని విష్ణుమూర్తి



ప్రత్యేక అలంకరణలో పిఠాపురం వేణుగోపాలస్వామి



సామర్లకోటలో రుక్మిణీ సమేత పాండురంగ స్వామి కల్యాణం



ఆలయం వద్ద బారులు తీరిన భక్తులు

సామర్లకోట: రుక్మిణి సమేత పాండురంగ స్వామి కల్యాణం ఆదివారం నేత్ర పర్వంగా నిర్వహించారు. స్థానిక ప్రసన్నాంజనేయస్వామి ఆలయం వద్ద పాండురంగ స్వామి ఆలయంలో ఏటా ఆషాఢ మాసం తొలి ఏకాదశి పర్వదినంలో స్వామి వారి కల్యాణం నిర్వహిస్తారు. తొలి ఏకాదశి రోజున స్వామి వారిని దర్శించుకోవడం ద్వారా మంచి ఫలితాలు లభిస్తాయని భక్తుల నమ్మకం. జిల్లా నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు ఆలయానికి తరలివచ్చారు. ఆలయ ధర్మకర్తలు ఆయోధ్యల పద్మ రాజేంద్రకుమార్, రాజేష్ భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. నూతన దంపతులు స్వామి వారిని దర్శించుకోవడం ద్వారా సంతానం కలుగుతుందని భక్తుల నమ్మకం. నూతన దంపతులు ఇళ్ల వద్ద నుంచి పెళ్లి వస్త్రాల అలంకరణతో ఆలయానికి వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులు స్వామివారిని దర్శించుకోవడానికి బారులు తీరారు. సుమారు 190 ఏళ్ల క్రితం నిర్మించిన ఆలయం కావడంతో ఒకవైపు మార్గం మాత్రమే ఏర్పాటు చేయడంతో కిలోమీటరు పొడవున భక్తులు బారులు తీసారు. ట్రాఫిక్ ఎఎస్సై రత్నం ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాట్లు చేశారు. వెంకటరమణ, కల్యాణలక్ష్మీ దంపతులతో పంచారామ క్షేత్ర అభిషేక పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, చంటి కల్యాణం జరిపించారు. భక్తులకు ఆలయ ధర్మకర్తల ఆధ్వర్యంలో పానకం, చక్కెర పొంగలి, పులిహోర ప్రసాదాలను అందజేశారు. ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, నిమ్మకాయల రంగనాగ్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అయ్యారక సంఘ అధ్యక్షుడు ఆవాల లక్ష్మీనారాయణ, పటణ పార్టీ అధ్యక్షుడు పాగా సురేష్ కుమార్ స్వామి వారిని దర్శించుకున్నారు. సీఐ కృష్ణభగవాన్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

ఘనంగా తొలి ఏకాదశి పూజలు

పిఠాపురం: తొలి ఏకాదశి సందర్భంగా ఆదివారం ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచి ఆలయాల్లో ప్రత్యేక అభిషేకాలు అర్చనలు నిర్వహించారు. పిఠాపురంలో ప్రముఖ ఆలయాలైన పాదగయ శ్రీకుక్కుటేశ్వరస్వామి, కుంతీ మాధవ స్వామి, వేంకటేశ్వరస్వామి, శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానం, మహాలక్ష్మి దేవి, రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాల స్వామి, గొల్లప్రోలు మండలం తాటిపర్తి నాగేశ్వరస్వామి సమేత అపర్ణాదేవి, దుర్గాడ రామలింగేశ్వరస్వామి, చేబ్రోలు సీతారామస్వామి, రామలింగేశ్వరస్వామి తదితర ఆలయాల్లో ఆదివారం తెల్లవారు జాము నుంచి స్వామి వార్లకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. వందలాది మంది భక్తులు ఆలయాలకు వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారిని దర్శించుకున్నారు. పలు ఆలయాల్లో తొలిఏకాదశిని పురస్కరించుకుని ప్రత్యేక భజనలు, కోలాటం ప్రదర్శన, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

పంచారామ క్షేత్రంలో ప్రత్యేక పూజలు

సామర్లకోట: ఆషాఢ మాసం తొలి ఏకాదశి సందర్భంగా పంచరామ క్షేత్రమైన బాలత్రిపుర సుందరి సమేత కుమారరామభీమేశ్వరస్వామి ఆలయంలో శ్రీలక్ష్మీ సమేత విష్ణుమూర్తి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో స్వామి వారికి అమ్మవార్లకు పంచామృతాలతో అభిషేకాలు, పూజలు చేశారు. పురాతన విష్ణు ఆలయమైన మాండ్యనారాయణ స్వామి ఆలయంలో పంచామృతాలతో అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక విఘ్నేశ్వరా థియేటర్ ఎదురుగా ఉన్న వేణుగోపాలస్వామి ఆలయంలో, పాత సామర్లకోటలోని వేణుగోపాల స్వామి, అన్ని రామాలయాలు, విష్ణు ఆలయాల్లో, వేట్లపాలెం వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.



ప్రత్యేక అలంకరణలో పిఠాపురం కుంతీమాధవస్వామి